క్లుప్తంగా

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



చెక్కును అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: గ్రామాల్లో అభివృద్ధి అంటే ముందుగా గుర్తొచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని గజ్వేల్ మండలం అక్కారం మాజీ సర్పంచ్ బాల్‌చంద్రం అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం అభినందనలు



సాయిని సన్మానిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకునే విధంగా ప్రభుత్వం విద్యా అవకాశాలను కల్పిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించిన అయిలేని మణికంఠేశ్వర్‌రెడ్డి, పొట్లపల్లికి చెందిన బత్తిని సాయిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మాజీ ఎంపీపీ వెంకట్, కాంగ్రెస్ నాయకులు రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, అనిల్‌కుమార్, మోహన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఎంపీ పరామర్శ



ప్రతాప్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ

మద్దూరు(హుస్నాబాద్): ఇటీవల మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తల్లి సత్తెమ్మ మృతి చెందగా ఆయనను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అలాగే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

ఎండిన వరి పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్‌రూరల్: నియోజకవర్గంలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ వాపోయారు. జిల్లెలగడ్డలో ఎండిన వరి పంటలను ఆదివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో సాగునీరు లేక రైతులు నిత్యం తమ పంటలు నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ అధికారులు ఎండిన పంటలను సర్వేచేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని, ప్రభుత్వం ఎకరాకు రూ.40 వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు శంకర్, రాజు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న క్లబ్‌ల సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

నాచగిరీశా..
ఎవరికీ పట్టని గోస..

రెండో యాదాద్రిగా పేరొందిన నాచారం గుట్ట శ్రీలక్ష్మీనరసింహ క్షేత్రం నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. కోట్ల ఆదాయం ఉన్నా.. ప్రగతి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. మొక్కేవారే తప్ప పట్టించుకొనేవారు లేరనే దుస్థితి నెలకొంది.

అభివృద్ధికి నోచుకోని క్షేత్రం

- ఊరించి ఉసూరుమనిపించిన బృహత్ ప్రణాళిక
- అసౌకర్యాల నడుమ యాత్రికుల పాట్లు
- 19 నుంచి బ్రహ్మోత్సవాలు

వర్గల్(గజ్వేల్): క్షేత్రాన్ని ముగ్గురు సీఎంలు, ఒక గవర్నర్ సందర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలోనూ క్షేత్రం దశ మారలేదు. నాచగిరి ఇక మరో యాదాద్రి అంటూ ఊదరగొట్టిన రూ.100 కోట్ల బృహత్ ప్రణాళిక బుట్టదాఖలైంది. యాత్రికులకు సౌకర్యవంతంగా ప్రగతితో భాసిల్లాల్సిన క్షేత్రం అసౌకర్యాల నెలవుగా మిగిలింది. 19 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

దర్శించుకొన్న ప్రముఖులు

భాగ్యనగరానికి చేరువలో హరిద్రానది తీరాన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్ట వద్ద శ్రీలక్ష్మీనృసింహక్షేత్రం వెలసింది. కొండ గుహల్లో స్వయంభుగా కొలువైన స్వామివారి దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యం వందలాది భక్తులు తరలివస్తుంటారు. సీఎం హోదాలో దివంగత ఎన్టీరామారావు, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రెండు సార్లు కేసీఆర్, గవర్నర్ హోదాలో సుశీల్ కుమార్‌షిండే, పీఠాధిపతులు తదితర ప్రముఖులు నాచగిరి క్షేత్రాన్ని సందర్శించారు.

గుడారాలే దిక్కు



గుడారాల్లో బసచేసిన యాత్రికులు(ఫైల్)

అధిక సంఖ్యలో తరలివచ్చే యాత్రికులు బసచేసేందుకు తగినన్ని సత్రాలు, అతిథిగృహాలు లేవు. దశాబ్దాల క్రితం నిర్మించిన 48 సత్రాలు, 17 కాటేజీలే ఇప్పటికీ దిక్కయ్యాయి. అవి మినహా అభివృద్ధేమీ జరగలేదు. చెట్ల నీడ, తాత్కాలిక గుడారాలే భక్తులకు విశ్రాంతి గృహాలయ్యాయి.

ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం

నాచగిరి క్షేత్రానికి వివిధ పద్దుల ద్వారా ప్రతియేటా రూ.3 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరుతుంది. గత సంవత్సరం ఏకంగా రూ.4కోట్లు దాటింది. యాత్రికుల ఆదరణతో ఆలయ ఆదాయం దినదిన ప్రవర్ధమానమవుతున్నప్పటికీ వారికి సౌకర్యాలను విస్మరిస్తున్నారనే అపఖ్యాతిని యంత్రాంగం మూటకట్టుకుంటున్నది.

సీఎం రేవంత్ ప్రభుత్వంపైనే ఆశలు

నిర్లక్ష్యానికి చిరునామాగా మారిన నాచారం గుట్ట క్షేత్రంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి అభివృద్ధికి బాటలు వేయాలని భక్తులు కోరుతున్నారు. అసంపూర్తి పనులపై దృష్టి సారించడంతోపాటు, సత్రాలు, అతిథిగృహాల సంఖ్య, శౌచాలయాలు, దుస్తులు శుభ్రం చేసుకునే గదుల సంఖ్య పెంచాలని, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సగంలోనే స్నానపుఘాట్లు

మూలవాగు దిగువకు మురుగును పారదోలేందుకు క్షేత్రంలో 900 మీటర్ల పొడవునా మురుగు కాలువల నిర్మాణ పనులు ఇరిగేషన్‌శాఖ పర్యవేక్షణలో చేపట్టారు. కానీ యేడాది దాటుతున్నా పనులు పూర్తికాలేదు. అర్ధాంతరంగా పనులు ఆపేశారు. దీంతో ప్రధాన ఆలయం పక్కన, సత్రాల చెంత మురుగునీరు నిలిచి పరిసరాలలో దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు సుందరీకరణలో భాగంగా వాగు ఒడ్డున స్నానవాటికల నిర్మాణ పనులు సగంలోనే చతికిలపడ్డాయి. పనుల కోసం అధికారులను వాకబు చేస్తే రేపు, మాపు అనడం తప్ప యేళ్లుగా ఏ పనులు పూర్తికావడం లేదు. వాగులో స్నానాలకు దిగితే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.



అర్ధాంతరంగా నిలిచిన స్నానవాటిక నిర్మాణ పనులు

సంవత్సరం	ఆదాయం
2018-19లో	రూ.2,64,56,868
2019-20లో	రూ.1,50.29,404
2020-21లో	రూ.2,55,76,610
2021-22లో	రూ.2,50,80,791
2022-23లో	రూ.3,23,06,419
2023-24లో	రూ.4,04,53,178



అసంపూర్తి కాలువతో ఆలయ పక్కన నిలిచిన మురుగునీరు

అభివృద్ధిపై ఆశలు పెంచిన బృహత్ ప్రణాళిక

మాజీ సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 2015 మార్చి 12న నాచగిరి సందర్శించారు. సీఎం హోదాలో రావడం, తన సొంత నియోజకవర్గంలోని ఆలయం కావడంతో క్షేత్ర అభివృద్ధిపై ఆశలు పెరిగాయి. అదే సంవత్సరం ఆగస్టు 13న నాచగిరి సమగ్రాభివృద్ధి కోసం బృహత్ ప్రణాళిక తెరపైకి వచ్చింది. అభివృద్ధికి కీలక అడుగు పడినట్లేనని భావించారు. నాచగిరి బృహత్ ప్రణాళిక రూపకల్పన కోసం ఫైవ్‌మెన్ కమిటీ తొలిసారి 2015 అక్టోబర్ 15న నాచగిరిలో, ఆ తరువాత 2017 ఆగస్టు 24న, సెప్టెంబర్ 4న, సెప్టెంబరు 12న, సెప్టెంబరు 25న సమావేశాలు నిర్వహించారు. ప్రాకారాలు, రాజగోపురం, గాలిగోపురాలు, మాడ వీధులు, బీటీ రోడ్లు, షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణకట్ట, పార్కింగు, డార్మెటరీలు, సత్రాలు, వీఐపీ అతిథి గృహాలు, విస్తృతంగా శౌచాలయాలు, దుస్తులు మార్చుకునే గదులు తదితర నిర్మాణాల కోసం రూ.100 కోట్ల అంచనాలతో బృహత్ ప్రణాళికను సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపించారు. రికార్డులలో బృహత్ ప్రణాళిక పేరే తప్ప అమలుకు నోచలేదు. క్షేత్రంలో కొత్తపనులు చేపడితే బృహత్ ప్రణాళికలో తొలగించే అవకాశముంటుందని అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెనకంజవేస్తున్నారు. దీంతో జాతరకు వచ్చే తీర్థజనులకు ఈ సంవత్సరం కూడా సర్దు'పాట్లు' షరామామూలే అనుకోవడంలో సందేహం లేదు.

మా ఇంటి దేవుడు నర్సింహస్వామి



మా ఇలవేల్పు నాచారం నర్సింహస్వామి. తరచూ ఇంటిల్లిపాది స్వామిని దర్శించుకొంటాం. గుట్ట కాడ వసతులు సరిగలేవు. సత్రాలల్ల ఫ్యాన్లు తిరుగుతలేవు. చీకటిపడితే వరండాలో లైట్లు వెలగవు. బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. ఎండాకాలం శాన ఇబ్బంది పడుతున్నం. కోనేరులో నీళ్ల శుభ్రంగ లేవు. గుడి దగ్గర ఇబ్బంది లేకుండ చర్యలు తీసుకోవాలె.

– గుండు రాజు, మైసమ్మగూడ, సికింద్రాబాద్

ఏండ్ల సంది ఇబ్బందులే



నాసారం గుట్టకు ఏండ్ల సంది వస్తున్నం. నాటి నుంచి గవే బాధలు. రూమ్‌లు సక్కగ ఉండయ్. అడిగినా పట్టించుకోరు. చెట్టు కిందనో, పుట్టకిందనో సర్దుకపోతం. నరసింహస్వామికి మొక్కులు చెల్లించి వెళ్లిపోతం. మేము దేవుని దగ్గరకు వచ్చినం. ఎవలతోని పంచాయితీ ఎందుకు.

– వెంకటయ్య, యాత్రికుడు, హైదరాబాద్

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



నాచగిరి క్షేత్రంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం. అందుబాటులోని వనరులను వినియోగించుకుంటాం. వీలైనన్ని చర్యలు తీసుకుంటాం. సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం. చర్యలు తీసుకోవాలని కోరుతాం. తీర్థజనుల కోసం తాత్కాలిక శౌచాలయాలు, చలవపందిళ్లు ఏర్పాటు చేస్తాం. సత్రాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయిస్తాం. అపరిశుభ్రత తొలగిస్తాం. ఇబ్బంది రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.

– పార్నంది విశ్వనాథశర్మ, నాచగిరి ఆలయ ఈఓ

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు



దుబ్బాకలో బీఆర్ఎస్ మాజీ మంత్రుల ఫ్లెక్సీలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- నిరసన కార్యక్రమాలలో కాంగ్రెస్ నాయకులు
- బీఆర్ఎస్ నేతల ఫ్లెక్సీల దహనం

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ పార్టీ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డిల ఫ్లెక్సీలను దహనంచేశారు.

దుబ్బాకటౌన్/మిరుదొడ్డి(దుబ్బాక)/చిన్నకోడూరు(సిద్దిపేట)/సిద్దిపేటరూరల్/వర్గల్(గజ్వేల్)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/ములుగు(గజ్వేల్)/బెజ్జంకి(సిద్దిపేట)కొండపాక(గజ్వేల్)/: దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొంగరి రవి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు దళిత నాయకులపై ఇష్టారీతిన మాట్లాడి సభా మర్యాదను మంట కలుపుతున్నారన్నారు. నాయకులు యేసురెడ్డి, రాజిరెడ్డి, భరత్, తేజ, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌స్వామిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శంకర్, ప్రతాప్, భూమయ్య, సుమలత, యాదగిరి, నాగరాజు, చంద్రం, చందు, మహిపాల్, స్వామి, వెంకట్, రమేశ్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరులో మహేందర్, పరశురాములు, రాజు, రాకేశ్, గణేశ్, ప్రశాంత్, వెంకట్, జయంత్ పాల్గొన్నారు. నారాయణరావుపేటలో బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కరుణాకర్, శ్రీనివాస్, ఉమాదేవి, రాజేశంగౌడ్, అశోక్‌గౌడ్, దేవయ్య, బాబు, నరేశ్ రాజు, నవీన్ పాల్గొన్నారు. వర్గల్‌లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, సందీప్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. జనార్దన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాము, నర్సింహారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ములుగు రాజీవ్‌రహదారిపై కాంగ్రెస్ నాయకులు సలీం, శ్రీనివాస్, ఏకాంబర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు ఆందోళన చేపట్టారు. బెజ్జంకి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి మాట్లాడారు. నాయకులు ప్రభాకర్, కృష్ణ, శ్రీనివాస్, నర్సయ్య, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, శరత్ పాల్గొన్నారు. కొండపాకలో నాయకులు లింగారావు, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రావు, ప్రభాస్, వెంటక్‌గౌడ్, కొమ్ము మల్లికార్జున్, మల్లేశం, గంగాధర్, సిద్దులు, రవి, కరుణాకర్ నిరసనలో పాల్గొన్నారు.



మిరుదొడ్డిలో..

పిల్లల ప్రవర్తన గమనించడం తప్పనిసరి

– సీఐ విద్యాసాగర్



మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

కొండపాక(గజ్వేల్): పిల్లల ప్రవర్తనలను ఎప్పటికప్పుడు గమనించాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ సూచించారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లిలో పోలీస్ కళాకారులు ఆదివారం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ యువత క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. అలాగే గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. రోడ్డు నిబంధనలు పాటించాలని, ఆటోల్లో పరిమితులకు మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని సూచించారు. కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, సాంస్కృతిక సారధి బృందం సభ్యులు శ్యాంసుందర్, ప్రకాశ్, ప్రసాద్, కనకయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

సిద్దిపేటకమాన్: కళాకారులను ఆదుకుని పెన్షన్ ఇవ్వాలని, రూ.వెయ్యి కోట్ల సంక్షేమ నిధులు కేటాయించాలని తెలంగాణ కళాకారుల వేదిక కమిటీ నాయకులు కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఐక్యవేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని శాఖలలో కల్చరల్ కోటాను ఏర్పర్చి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించడం బాధాకరం

- సీపీఎస్ రద్దు చేసి.. ఓపీఎస్‌ను అమలు చేయాలి
- టీపీటీఎఫ్ రాష్ట్ర నేత తిరుపతిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న టీపీటీఎఫ్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆరు నెలల్లో హామీలను అమలు చేస్తామని ప్రకటించి, ఇప్పుడు వాటిని విస్మరించడం బాధాకరమని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మండిపడ్డారు. స్థానిక టీపీటీఎఫ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి.. ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎలాంటి కోరికలు కోరవద్దని శాసనసభలో అనడం సరికాదని వాపోయారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు హక్కుగా రావాల్సిన డీఏలు, పీఆర్సీలు వెంటనే చెల్లించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోతే ఏప్రిల్ 1నుంచి నిరసన కార్యక్రమాలు ఉధృతంగా చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శి రాజయ్య, జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్, జిల్లా కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, సత్యనారాయణ, శివాజీ, అజీజ్, రాంరెడ్డి, పాపిరెడ్డి, మంజుల, ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్లు జమీర్ మోహియొద్దీన్, జానకి రాములు, తిరుపతి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



మిరుదొడ్డి(దుబ్బాక): పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు తప్పకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట రవి, శ్రీనివాస్‌గౌడ్, పరశురాములు ఉన్నారు.

రేబర్తి గ్రామంలో..

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని రేబర్తి గ్రామంలోని 1వ వార్డులో రూ.5లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతి, బాల్‌రెడ్డి, లింగారెడ్డి, మోహన్‌రెడ్డి, గణేశ్, చంద్రమౌళి, భూపతిరెడ్డి, నర్సిరెడ్డి, మైసయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

తుక్కాపూర్, చందాపూర్‌లలో..

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని తుక్కాపూర్, చందాపూర్ గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున మంజూరైన నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీజేపీ నాయకులు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ చిక్కుడు చంద్రం, లింగాల స్వామి, మురళి, రవి, బాల్‌రాజు, స్వామి, శ్రీకాంత్, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవక్కపల్లెలో..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లెలో రూ.7లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను నాయకులు ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ కృష్ణ, రత్నాకర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, అజయ్, శివారెడ్డి, అంజిరెడ్డి, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అక్కన్నపేట(హుస్నాబాద్): ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు



చేర్యాల(సిద్దిపేట): 1991-92 బ్యాచ్ విద్యార్థినులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004-05 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 21 యేళ్ల తర్వాత కలుసుకొన్న వారంతా సందడి చేశారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో 1991-92లో పదోతరగతి చదివిన విద్యార్థినులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. అప్పుడు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

స్నేహితుల సహాయం



లలితకు చెక్కు అందజేస్తున్న స్నేహితులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్లో 2008-09 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు స్నేహితురాలి కుటుంబానికి బాసటగా నిలిచారు. గ్రామానికి చెందిన మిట్టపల్లి లలిత భర్త పవన్ ఐదేళ్ల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. ఆమె కూలీ పనులు చేసుకుంటూ కుమారుడిని పోషించుకుంటోంది. లలిత దీనస్థితికి చలించిన మిత్రులు ఆదివారం రూ.25 వేలు, క్వింటాల్ బియ్యం అందజేశారు. కుమారుడి పైచదువుల కోసం ఆర్థిక సహాయం అందజేస్తామని భరోసా నిచ్చారు.

మిత్రుడి కుటుంబానికి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇటీవల ఆత్మహత్య చేసుకొన్న గొల్లపల్లికి చెందిన కొడకండ్ల సాయి కిరణ్ కుటుంబాన్ని ప్రైవేట్ హౌజ్ వైరింగ్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ మండల సభ్యులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక క్వింటాలు 50 కిలోల బియ్యం, 5కిలోల మంచినూనెతో పాటు రూ.27 వేల అందించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ యూనియన్ తరపున ఆర్థిక సాయం అందించామన్నారు. శ్రీధర్, శ్రీనివాస్, కనకయ్య, కుమారస్వామి, నర్సింహులు, వెంకటేశ్, నవీన్ పాల్గొన్నారు.